క్లుప్తంగా

స్కూళ్లకు వంటపాత్రలు పంపిణీ



వంట పాత్రలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా మండలంలోని వంద ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలను ఉచితంగా సరఫరా చేసింది. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఎంఈఓలు గోపాల్‌రెడ్డి, తులసీరాం, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

28న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

పలమనేరు/పెద్దపంజాణి: నియోజకవర్గంలోని పెద్దపంజాణిలో ఈనెల 28న తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు బాగారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే అన్నదానం చేస్తామని, నియోజకవర్గంలోని వాల్మీకి, బోయ కులస్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సిమెంట్ బెంచీల వితరణ



టీచర్లకు బెంచీలను అందజేస్తున్న శ్రీనివాసులుశెట్టి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జెడ్పీ హైస్కూలుకు బుధవారం కల్లూరుకు చెందిన భాస్కర శ్రీనివాసులు శెట్టి తన కుమారుడు శివరాజేష్ జ్ఞాపకార్థం రూ.ఏడువేల విలువ చేసే రెండు సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి, ఉపాధ్యాయులు వెంకట సిద్ధులు, రాజశేఖర్, రాజేంద్ర, ప్రకాష్, వెంకట రమణారెడ్డి, స్నేహమాలిని తదితరులు పాల్గొన్నారు.

టపాకాయల విక్రయానికి లైసెన్సులు పొందాలి

పుంగనూరు: దీపావళి పండుగను పురస్కరించుకుని టపాకాయల విక్రేతలు విధిగా లైసెన్సులు పొందాలని అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, కందూరు మండలాల్లో విక్రయదారులు ఈనెల 31లోపు లైసెన్సులకు దరఖాస్తు చేయాలన్నారు. చట్టవ్యతిరేకంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుర్గాదేవి ఊరేగింపు



పుంగనూరు: పట్టణంలోని నాగపాళ్యంలో మార్వాడీలు ఏర్పాటు చేసిన దుర్గాదేవిని బుధవారం పట్టణంలో ఊరేగించారు. మేళతాళాల నడుమ బాణసంచా పేలుస్తూ కోలాహలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం చేశారు.

గడ్డివామి దగ్ధం

పుంగనూరు: మండలంలోని కుదుపూరులో సుబ్రమణ్యంకు చెందిన గడ్డివామి మంగళవారం రాత్రి దగ్ధమైంది. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదం మూలాన సుమారు రూ.30 వేల ఆస్తినష్టం కలిగిందని బాధితుడు తెలిపాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు పంచాయతీ జంగాలపల్లె గ్రామ సమీప పొలాల్లో బుధవారం ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం..పేకాట ఆడుతున్నారనే ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో దాడులు చేశారు. జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,040 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ఘనంగా మైలేరు పండుగ



కామినేపల్లె మైలేరులో పరుగులు తీస్తున్న పశువులు

బైరెడ్డిపల్లె: మండలంలోని కామినేపల్లెలో బుధవారం మైలేరు పండుగ ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రైతులు పశువులను అందంగా ముస్తాబు చేసి పరుగుపందెంలో వదిలారు. పశువులకు సినీ నటుల పేర్లు, జంతువుల పేర్లు పెట్టి పందెంలో వదలడంతో యువకులు వాటిని నిలువరించేందుకు నువ్వా, నేనా? అనే లెవెల్లో పోటీ పడ్డారు. విజేతలుగా నిలిచిన పశువులకు సంబంధించి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు.

మళ్లీ జగనన్నను సీఎం చేద్దాం

- సీఎం సుపరి పాలనను ప్రజలకు చాటిచెప్పండి
- ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎండగట్టండి
- పార్టీ శ్రేణులకు నేతల పిలుపు



సోమల: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి, జింకా చలపతి

సోమల/సదుం/చౌడేపల్లె: అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు ఆంధ్రప్రదేశ్‌కు రాబోవు ఎన్నికల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ మండల కన్వీనర్ గంగాధరం ఆధ్వర్యంలో సోమల సినిమా క్రాస్ సమీపంలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి?' అనే అంశంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇదే కార్యక్రమాన్ని సదుం, చౌడేపల్లె మండల కేంద్రాల్లోనూ నిర్వహించారు. పెద్దిరెడ్డితో పాటు నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి మాట్లాడారు. జగనన్న సీఎంగా పగ్గాలు స్వీకరించిన రోజు నుంచిఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలతో ఆదుకుంటూ సుపరి పాలన అందిస్తున్నారన్నారు. ఇన్ని మంచి పనులు చేస్తున్నా ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, దీనిని సమర్థవంతంగా తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే?' కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రచార కరపత్రాలను సర్పంచులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, పార్టీ జిల్లా కార్యదర్శులు శీలం భాస్కర్, రవీంద్రరెడ్డి, నేతలు బెంగళూరు సాంబయ్య, గరుడప్పగారి శ్రీరాములు, త్రివేణి, సరస్వతమ్మ, రమణయ్య, సదుం జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డప్పరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్ రెడ్డి, సదుం వైస్ ఎంపీపీలు ధనంజయ రెడ్డి, అమరావతి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, చౌడేపల్లె జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, చౌడేపల్లె వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, రెడ్డిప్రకాష్, వెంకటరెడ్డి, పీహెచ్‌సీ కమిటి చైర్మన్ కళ్యాణ్, కో–ఆప్షన్ మెంబర్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో..

పులిచెర్ల(కల్లూరు): రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో నిర్వహించారు. ఎంపీపీతోపాటు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఆయా వర్గాల ప్రజలు పొందిన లబ్ధి గురించి గ్రామాల్లో ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను ఎండగట్టాలన్నారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, పోకలచంద్ర, ముర్వత్ బాషా, ఎన్ఎస్ రెడ్డి ప్రకాష్, నాగరాజ ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, షుకూర్, రెడ్డి అహమ్మద్, మంజుల, గోవిందరెడ్డి, మునీశ్వర పాల్గొన్నారు.



పులిచెర్ల : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ



రొంపిచెర్ల : మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచెర్ల: ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అవసరం ఉందని గ్రామాల్లో ప్రజలకు చాటిచెప్పాలని జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు, బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల గ్రామ పంచాయతీలలో నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10 వరకు ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, ఎంపీటీసీ లక్ష్మి, సిరాజున్నీసా, సర్పంచ్ అన్సర్ బాషా, పార్టీ నాయకులు కమలాకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, ఇర్షాద్, యుగంధర్ రెడ్డి, జి.రామచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కోటా వెంకటరమణ, విజయభాస్కర్ రెడ్డి, సైఫూల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్ పంపిణీ



బాధితురాలికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: అనారోగ్యంతో బాధ పడుతూ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసుకున్న మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం మంజూరైంది. వివరాలు.. మండలంలో పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెకు చెందిన భారతి కడుపులో గడ్డ ఉందని, ఆపరేషన్ చేసుకునేందుకు ఆర్థికసాయం కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ప్రభుత్వం నుంచి రూ.45 వేలను మంజూరు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను ప్రజాప్రతినిధులు బుధవారం బాధితురాలికి అందజేశారు. ప్రభుత్వ సాయంతో తాను ఆపరేషన చేయించుకున్నాని మంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, పార్టీ నాయకులు యుగంధర్ రెడ్డి, కోటా వెంకటరమణ, యర్రంరెడ్డి పాల్గొన్నారు.

సోమలలో..



సోమల : బాధితుడికి చెక్కు అందజేస్తున్న పెద్దిరెడ్డి

సోమల: మండలంలోని నంజంపేటకు చెందిన రఘు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్సతో కోలుకుంటున్నాడు. ఇటీవలే మండల పర్యటనకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి సర్పంచ్ వెంకటరెడ్డి అతడి సమస్యను నివేదించారు. స్పందించిన మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.38 వేలు మంజూరు చేయించారు. బుధవారం బాధితుడికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి చెక్కును అందజేశారు.

లంచాల యవ్వారంపై వాదులాట!

- కంప్యూటర్ ఆపరేటర్లదే రాజ్యం
- 'సాక్షి' కథనంపై తహసీల్దార్ కార్యాలయంలో కలకలం



రెవెన్యూ శాఖలో లంచావతారులు

కుప్పం: కుప్పం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి, క్షేత్ర స్థాయి అధికారుల మధ్య విభేదాలు తలెత్తాయి. రెండు రోజుల క్రితం సాక్షి దినపత్రికలో 'రెవెన్యూ శాఖలో లంచావతారులు' శీర్షికతో ప్రచురించిన కథనం చర్చనీయాంశమైంది. లంచాల వసూళ్లపై వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, కార్యాలయ సిబ్బంది బుధవారం పరస్పరం వాగ్యుద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో పని చేసే వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలకు సంబంధం లేకుండా కార్యాలయంలో పాలన సాగుతోందని వాదనకు దిగారు. వసూళ్ల బాగోతంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కొందరు వీఆర్‌ఓ ఏకమైనట్లు సమాచారం.

కంప్యూటర్ ఆపరేటర్లదే రాజ్యం

తహసీల్దార్ కార్యాలయంలో కొందరు ఆపరేటర్లే పెత్తనం చెలాయిస్తున్నారు. రూరల్ ప్రాంతంలో పనిచేసే వీఆర్‌ఓలు, ఆర్‌ఐలకు తెలియకుండానే ఆన్‌లైన్‌లో భూముల వివరాలకు సంబంధించి మార్పులు–చేర్పులు చేస్తున్నారని, దీనికి వీఆర్‌ఓలు బలిపశువులవుతున్నట్టు ప్రచారంలోకి వచ్చింది. ఈ మధ్య కాలంలో పైపాళ్యంలో ఓ సర్వే నంబర్‌లో అన్నదమ్ములకు రావాల్సిన డీకేటీ భూముల వివరాలు తారుమారయ్యాయి. అలాగే ములకలపల్లెలో అన్నదమ్ముల భాగ పరిష్కారంలో 3 సెంట్ల భూమి 37 సెంట్లుగా రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఇది స్థానిక వీఆర్‌ఓకుగానీ, ఆర్‌ఐలకుగానీ తెలియకపోవడం గమనార్హం! బాధితులు ఈ సమస్యపై తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా వారి గోడును పట్టించుకునేవారు లేరు. కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు అటు కాంట్రాక్టు, ఇటు ఔట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన వారు కాకపోవడంతో ఇష్టానుసారంగా మామూళ్ల ముసుగులో రికార్డులు తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ పార్వతమ్మను వివరణ కోసం ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

శాంతిపురం: కుప్పం–పలమనేరు జాతీయ రహదారిపై గత ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వివరాలు..మఠం పంచాయతీ ఎం.శాంతంపల్లెకు చెందిన ప్రైవేటు డెయిరీ కార్మికుడు చంద్రప్ప(44) బైకుపై ఏడవ మైలు వైపు వెళ్తుండగా తుమ్మిశి వాదుల చెరువు కట్టపై ఎదురుగా మోపెడ్‌పై వచ్చిన హరికృష్ణ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయాలైన ఇద్దరినీ కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. హరికృష్ణ కోలుకుని ఇంటికి చేరగా, చంద్రప్పకు తల లోపలి ఎముకలు చిట్లి మెదడు దెబ్బతింది. దీంతో అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

చంద్రప్ప మృతదేహానికి బుధవారం ఎమ్మెల్సీ భరత్, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని, వైద్యం కోసం చేసిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.10 వేలను అందజేశారు.



చంద్రప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, మృతుడు చంద్రప్ప(ఫైల్)

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ ఆర్థిక సాయం

రామకుప్పం: మండలంలోని పెద్దతండా పంచాయతీ తులసీనాయక్ తండాకు చెందిన లక్ష్మమ్మ(64), మిట్టపల్లెకు చెందిన మాణిక్యం (80) మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ స్పందించారు. తులసీనాయక్ తండాలో సర్పంచ్ మోహన్‌నాయక్, మిట్టపల్లెలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ మురళీకృష్ణ ద్వారా రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ కామరాజునాయక్, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, మంజునాథ్ రెడ్డి, మధు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ మొదటి వార్డులో సామగుట్టపల్లె, బండశెట్టిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు హనుమంతు(56), చిన్నప్ప మృతి చెందారు. ఎమ్మెల్సీ భరత్, మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ సుధీర్ వారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

చిత్తూరు అర్బన్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ పిలుపునిచ్చారు. మిట్టూరులోని మెప్మా ప్రాజెక్ట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన భరతమాత పట్టణ మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించడం ద్వారా కుటుంబం, సమాజం ఆర్థికంగా బలపడతాయన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. 'గుప్పెడు బియ్యం' కార్యక్రమం గురించి తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, మెప్మా జిల్లా ఇన్‌చార్జి ఐబీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకే ధరణి డిపాజిట్లు

పలమనేరు: తమ బ్యాంకులో సీనియర్ సిటిజెన్స్ ధరణి డిపాజిట్లు చేయడానికి ఈనెలాఖరు వరకే సమయమని పలమనేరు డీసీసీ బ్యాంకు మేనేజర్ ఆశాబీ బుధవారం తెలిపారు. రూ.వెయ్యి నుంచి ఎంత సొమ్ము అయినా డిపాజిట్ చేయవచ్చని, దీనిపై 8 శాతం వడ్డీ ఇస్తామన్నారు. అలాగే డిపాజిట్ చేసిన వారికి జీవితబీమా కూడా వర్తిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

లీస్టెర్ యూనివర్సిటీతో అపోలో ఒప్పందం

- భారత్‌లోనే విదేశీ విద్య అభ్యసించడానికి అంగీకారం
- చిత్తూరులో వివరాలు వెల్లడించిన యూనిట్ హెడ్ నరేష్



యూకేలోని ప్రతినిధులతో అపోలో వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి

చిత్తూరు అర్బన్: భారతదేశంలోనే విదేశీ విద్యను అభ్యసించడానికి చిత్తూరులోని అపోలో యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు బ్రిటన్ (యూకే)లోని లీస్టెర్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వైస్ చైర్ పర్సన్ ప్రీతారెడ్డి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ వివరాలను చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. విద్య, వైద్య రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడానికి, పరిశోధనా కార్యక్రమాలను బలోపేతం చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. విదేశాల్లో డిగ్రీ, బీటెక్ లాంటి విద్యను అభ్యసించడానికి ఇక నుంచి విద్యార్థులు అక్కడికి వెళ్లాల్సిన పనిలేదన్నారు. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లీస్టెర్(యూవోఎల్) టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ఎక్సలెన్స్ ఫ్రేమ్‌వర్క్‌లో ప్రపంచ వ్యాప్తంగా టాప్ 30 యూనివర్సిటీల్లో ఒకటన్నారు. ఇక్కడ విద్యను అభ్యసించాలనుకున్న విద్యార్థులు ఇక నుంచి యూకేకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. కోర్సు ఫీజు మొత్తంలో 25 శాతం చెల్లించి చిత్తూరులోని అపోలో యూనివర్సిటీ నుంచే డిగ్రీ చదివే అవకాశం ఉంటుందన్నారు. చివరి ఏడాది మాత్రం యూకేకు వెళ్లాల్సి ఉంటుందని, డిగ్రీ పూర్తవగా లీస్టెర్ యూనివర్సిటీ నుంచే పట్టా అందజేస్తామన్నారు. లీస్టెర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కనగరాజు నిషాన్‌తో కలిసి అపోలో యూనివర్సిటీ కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా విదేశాల్లో టాప్ యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం చేయాలనుకున్న యువత కోరిక, భారత్‌లోనే ఉంటూ సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు.

ప్రజారోగ్యమే సీఎం లక్ష్యం



వి.కోట : వృద్ధుడికి కళ్లద్దాలు పెడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పునరుద్ఘాటించారు. బుధవారం మండలంలోని చింతమాకులపల్లె సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేసి, మందులు ఇవ్వడమే కాకుండా అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మరింత మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసి ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. శిబిరంలో 347 మందికి వైద్యపరీక్షలు చేశారు. వృద్ధులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఎంపీపీ యువరాజు, సర్పంచ్ రామచంద్రప్ప, సచివాలయ కన్వీనర్లు రమేష్, నాగరాజు, డాక్టర్ రాజేష్‌నాయక్, నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

147 మందికి వైద్య పరీక్షలు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 147 మందికి వైద్యాధికారులు కావ్యశ్రీ, తేజేష్ కుమార్, మురళి, మౌనిక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన నిమిత్తం ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. సర్పంచ్ ఆవుల అరుణ, సింగిల్‌విండో అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, తహసీల్దార్ లోకేశ్వరరావు, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఎంఈఓలు గోపాల్ రెడ్డి, తులసీరాం, ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, పీఎస్‌లు గణపతి, జప్రుల్లా, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగా రెడ్డి, జిల్లా కార్యదర్శి మాకయ్య, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపల్లెలో 323 మందికి..

గంగవరం: మండలంలోని తాళ్లపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మొత్తం 323 మందికి వైద్యాధికారులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 22మందిని కళ్లద్దాలకు, 10మందిని ఆరోగ్యశ్రీకి ఎంపిక చేశారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ శంకరమ్మ, వైద్యాధికారి శ్రీనివాసులు, నారాయణస్వామి, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పెద్దకొండామర్రిలో 293 మందికి..

చౌడేపల్లె: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ఇంటి ముంగిటకే ప్రభుత్వం వైద్యసేవలు అందిస్తోందని ఎంపీపీ రామమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకొండామర్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. శిబిరంలో 293 మంది గైనకాలజిస్ట్ డాక్టర్ అనూరాధ, ఈఎన్‌టి డాక్టర్ మనీష్, పూజ, ప్రవీణ్ వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు అనంతరం 'జగనన్న కంటి వెలుగు' కార్యక్రమంలో కళ్ల పరీక్షలు చేసుకున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. సర్పంచులు జయసుధమ్మ, రఘు రామిరెడ్డి, ఎంపిటీసీ షాహీనా, ఎంపీడీఓ సుధాకర్ పాల్గొన్నారు.



పెద్దపంజాణి : రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



గంగవరం: ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



చౌడేపల్లె : పెద్దకొండామర్రిలో..



శాంతిపురం : రోగులకు మందుల కిట్లను ఇస్తున్న అధికారులు, నాయకులు

ఎంకె పురంలో 221 మందికి..

శాంతిపురం: మండలంలోని ఎంకె.పురంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రభుత్వ వైద్యులు ప్రసాద్, ఉషారాణి, పీఈఎస్ ఆస్పత్రి స్పెషలిస్టులు సంజనా రెడ్డి, గోపీచంద్ 221 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి, ఎంపీడీఓ హేమమాలిని, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణమూర్తి, సర్పంచ్ గజ్జల మోహన్, ఎంపీటీసీ సభ్యుడు బాబురెడ్డి పాల్గొన్నారు.